ప్రజాశక్తి
మంగళవారం 25 ఏప్రిల్ 2023

త్వరితగతిన వసతి భవనాల నిర్మాణం

ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

వసతి భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్‌జియుకెటి ఛాన్సలర్ కె.సి రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ట్రిపుల్ ఐటిని సోమవారం సందర్శించిన ఆయన తాగునీరు, పరిశుభ్రత, హాస్టల్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నిర్మాణాల నాణ్యతపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. సమావేశంఒ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఒఎస్‌డి సుధాకర్‌బాబు, ఎఒ ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ, ఎఫ్ఒ అసిరినాయుడు, పిఆర్ఒ ఎం.షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించి గిరిజనుల పైనే దాడులు

- పోలీసులు కఠినంగా వ్యవహరించాలి
- బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ తర్వాతే జనరల్ నోటిఫికేషన్
- సమావేశాని రాని అధికారులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలి
- ఎస్‌టి కమిషన్ చైర్మన్ కె.రవిబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

గిరిజనుల భూములను ఆక్రమించి తిరిగి వారి పైనే దాడులు చేస్తున్నారని ఎస్‌టి కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు అన్నారు. గిరిజనుల రిజర్వేషన్లు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, దాడులు, గిరిజనులకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారులతో సోమవారం సమీక్షించారు. జిల్లాలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములపై వారికి హక్కులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. వారి భూముల్లో కొందరు దందా చేస్తూ వారి పైనే దాడులకు పాల్పడుతున్నారని, అటువంటి వారిపై చట్టపకారం చర్యలు తీసుకోవాలని పోలీసు యంత్రాంగానికి సూచించామన్నారు. గిరిజన సబ్‌ప్లాన్ నిధులు సక్రమంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. సబ్‌ప్లాన్ నిధులను ఖర్చు చేసి గిరిజన ప్రాంతాల్లో తాగునీరు అందజేయాలని ఆదేశించారు. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేసిన తర్వాతే జనరల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ఇవ్వాలని సూచించారు. గిరిజన చట్టాల అమల్లో లోపాలు ఉంటే వెంటనే సరిచేసుకుని సజావుగా అమలయ్యేలా చూడాలన్నారు. జిల్లాలోని గిరిజన గ్రామాలు, గూడేల వివరాలు, వారి జీవన స్థితిగతులను గుర్తించాలన్నారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి ఆర్థిక, విద్య, ఆరోగ్య రంగాలకు సంబంధించి మెరుగుపడేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పిహెచ్‌సిలు 24 గంటలు పనిచేసేలా చర్యలు చేపట్టాలన్నారు. నవరత్నాల్లో భాగంగా జిల్లాలో గిరిజనులకు మంజూరు చేసిన ఇళ్లు, ఇళ్ల స్థలాల పూర్తి వివరాల నివేదికలను 15 రోజుల్లో అందజేయాలని గృహనిర్మాణ సంస్థ అధికారులను ఆదేశించారు. గిరిజన సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తున్నా, సరిగా అమలు కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. తమ పర్యటన కార్యక్రమం ముందుగా తెలిపినా కొందరు అధికారులు రాలేదని, వారి నుంచి సంజాయిషీ కోరాలని కలెక్టర్‌కు సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టి కమిషన్ చైర్మన్ రవిబాబు

జిల్లాలో గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ కమిషన్‌కు వివరించారు. సమావేశంలో కమిషన్ సభ్యులు వి.శంకర్ నాయక్, కె.రామలక్ష్మి, ఎస్‌పి జి.ఆర్ రాధిక, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, ఐటిడిఎ పిఒ కల్పనాకుమారి, టెక్కలి సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వర్సిటీ నియామకాల్లో ఎస్‌టి రిజర్వేషన్ అమలు చేయాలి

ఎచ్చెర్ల : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఇకపై చేపట్టే బోధన, బోధనేతర ఉద్యోగ నియామకాల్లో ఎస్‌టి రిజర్వేషన్ తప్పనిసరిగా అమలు చేయాలని ఎస్‌టి కమిషన్ చైర్మన్ కె.రవిబాబు అన్నారు. విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన వర్సిటీ ఉన్నతాధికారులు, వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లతో సమీక్షించారు. రిజర్వేషన్ల అమలు విషయంలో అన్నిచోట్లా గిరిజనులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు జరిగిన తప్పిదాలను సరిచేస్తూ రాజ్యాంగపరంగా ఎస్‌టిలకు దక్కాల్సిన ప్రయోజనాలను కాపాడేందుకు కమిషన్ కృషి చేస్తోందన్నారు. వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో ఎక్కడా ఎస్‌టి రిజర్వేషన్లు సరిగ్గా అమలు కావడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కళాశాలల వారీగా ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్ల అమలుపై 15 రోజుల్లోగా కమిషన్‌కు నివేదిక సమర్పించాలని విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ సిహెచ్.ఎ రాజేంద్రప్రసాద్‌ను ఆదేశించారు. రిజర్వేషన్లు సరిగ్గా అమలు చేయని కళాశాలల అనుబంధ ప్రతిపత్తిని రద్దు చేయాలన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు వి.శంకర్ నాయక్, కె.రామలక్ష్మి, వర్సిటీ వైస్ ఛాన్సలర్ నిమ్మ వెంకటరావు, ఆర్ట్స్, కామర్స్, సైన్స్ కళాశాలల ప్రిన్సిపాల్స్ బి.అడ్డయ్య, ఎస్.ఉదయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడ అణుపార్కు వద్దు

- రద్దుకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - రణస్థలం

వినాశకర కొవ్వాడ అణుపార్కును రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. మండలంలోని కొవ్వాడ అణుప్లాంట్ ప్రభావిత గ్రామాల్లో సోమవారం పర్యటించిన అనంతరం కోటపాలెంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొవ్వాడ అణుపార్కు అమెరికాకు సిరి, ఉత్తరాంధ్రకు ఉరి అని అన్నారు. అమెరికా ప్రయోజనాల కోసం కొవ్వాడలో అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటు చేయడానికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అణుపార్కును రద్దు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో తీర్మానం చేయాలన్నారు. వినాశకర అణుపార్కును బిజెపి ప్రభుత్వం కొవ్వాడలో పెడుతుంటే వైసిపి, టిడిపి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. భూకంపాల జోన్‌లో ఉన్న కొవ్వాడలో అణుపార్కు పెట్టడం అంటే అణు బాంబు పెట్టడమేనన్నారు. ఈ ప్రాంతం అధిక జనసాంద్రత గల ప్రాంతమని ప్రకృతి వైపరీత్యాల వల్ల గానీ, మానవ తప్పిదం వల్ల గానీ, యంత్ర లోపం వల్ల గానీ ఏ చిన్న ప్రమాదం సంభవించినా అటు కాకినాడ నుంచి ఇటు ఒడిశాలోని ఛత్రపూర్ వరకూ సమస్త జీవకోటి సర్వనాశనం అవుతుందన్నారు. అణుపార్కు వల్ల విడుదలయ్యే రేడియో ధార్మికత వల్ల భూమి, నీరు, గాలి, ఆహార పదార్థాలు విషతుల్యమవుతాయని చెప్పారు. అభివృద్ధి చెందిన దేశాలు, సాంకేతిక పరిజ్ఞానం గల దేశాలు అణువిద్యుత్కేంద్రాలను మూసివేస్తున్నాయని గుర్తు చేశారు. దివాళా తీసిన వెస్టింగ్‌హౌస్ కంపెనీతో కలిసి రూ.లక్షల కోట్ల ప్రజా ధనంతో ఒకేచోట ఆరు అణు రియాక్టర్లు పెట్టడం దేశ ఆర్థిక వ్యవస్థకు, ప్రజల ప్రాణాలకు పెను ప్రమాదమని హెచ్చరించారు. ప్రమాదకరమైన, అత్యంత ఖరీదైన అణువిద్యుత్కేంద్రం అవసరం లేదని, పవన, సౌర విద్యుత్ వంటి ప్రత్యామ్నాయాలు ఉన్నాయని తెలిపారు. ధర్నాలో సిపిఎం నాయకులు

ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రవీణ్ ప్రకాష్ తీరు ఆక్షేపణీయం

స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ తీరు ప్రభుత్వ విద్యా వ్యవస్థని నిర్వీర్యం చేసే విధంగా ఉందని ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి నాయకులు అన్నారు. నగరంలోని పదో తరగతి స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాల పోరాట సమితి ఆధ్వర్యాన ఉపాధ్యాయులు సోమవారం నిరసన తెలిపారు. వ్యవస్థలో లోపాలను సరిదిద్దాల్సిన ఉన్నతాధికారి వ్యవస్థ మొత్తాన్ని లోపాల పుట్టగా చూపిస్తున్నారని చెప్పారు. చిన్న చిన్న కారణాలతో ఉపాధ్యాయులను నిందించడం, మెమోలు, షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లతో భయభ్రాంతులకు గురిచేస్తూ మొత్తం లోపమంతా ఉపాధ్యాయులపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఉపాధ్యాయులు పాఠాలు చెప్పడం, నోట్స్ దిద్దడం మాత్రమే పని అని, ఇది కూడా చేయకుండా రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటున్నారని ఉపాధ్యాయులను అవమానిస్తున్న తీరు ఆక్షేపణీయమన్నారు. విద్యా సంబంధ విషయాల్లో లోపాలను గుర్తించినప్పుడు వాటిని పై అధికారిగా ఉపాధ్యాయులకు తెలియజెప్పి దాన్ని సరిదిద్దాలన్నారు. పూర్తి వైఫల్యం ఉపాధ్యాయులదే అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరును మార్చుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి పర్యటనలు అంటూ మొత్తం విద్యా వ్యవస్థని ప్రయివేటు విద్యను ప్రోత్సహించేలా చేస్తున్నారని విమర్శించారు. తీరు మార్చుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఉత్పాదకతను పెంచే ఆవిష్కరణలు రావాలి

పంటల తెగుళ్లను తట్టుకునే పరిశోధనలు అవసరం : కలెక్టర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వ్యవసాయంలో పంటల ఉత్పాదకతను పెంచే కొత్త ఆవిష్కరణలు రావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అన్నారు. ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ ఆధ్వర్యాన ఉత్తర కోస్తా మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాన్ని నగరంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని సాధారణ పద్ధతుల్లోనే చేయడం వల్ల ఫలితాలు రావని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు చూపి ఆధునిక పద్ధతుల వైపు వారిని మరలించాలని సూచించారు. చైనాతో పోలిస్తే దేశంలో వరి ఉత్పాదకత సగం మాత్రమే ఉందని, అదే ఎరువుల వినియోగం పరిశీలిస్తే రెట్టింపు ఉందని చెప్పారు. వరి నుంచి ఇథనాల్, చెరుకు ఉంచి మొలాసిస్ ఉత్పత్తుల మాదిరి ఇతర పంటల్లోనూ ఆ రకమైన ప్రత్యామ్నాయ ఫలితాలు రాబట్టేలా శాస్త్రవేత్తలు కృషి చేయాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులు పెరుగుతున్న నేపథ్యంలో వరి సాగు మరింత పెరిగే అవకాశం ఉందని, దాని స్థానంలో ఇతర ప్రత్యామ్నాయ పంటలు వేసేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. ఎఎన్‌జిఆర్‌యు రీసెర్చ్ డైరెక్టర్ ఎల్.ప్రశాంతి, మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ వల్ల సాగు ఖర్చులు తగ్గుతాయని చెప్పారు. వరికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న వంటి ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. డాక్టర్ సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాల ఉత్పత్తికి సంబంధించి రైతులు మెళకువలు తెలుసుకోవాలని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని సులభతర వ్యవసాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

వరి ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.శ్రీనివాస్ సాగులో కీలక అంశాలను వివరించడంతో పాటు ఉత్తర కోస్తా జిల్లాలకు అనువైన రకాలపై కూలంకుషంగా విశదీకరించారు. అంతకుముందు ఉత్తర కోస్తా మండలంలో పరిశోధన, విస్తరణ ప్రగతిపై రూపొందించిన కరపత్రం, మొక్కజొన్న సాగుపై రూపొందించిన పుస్తకం, చోడి రకాలపై, షేడ్‌నెట్‌లో ఉద్యాన పంటల నారు పెంపకం, వేరుశనగ పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు తదితర అంశాలపై రూపొందించిన కరపత్రాలను కలెక్టర్, అతిథులు ఆవిష్కరించారు. సమావేశంలో పి.వి.కె జగన్నాథరావు, నేతాజీ, పత్తి ప్రధాన శాస్త్రవేత్త శ్రీలక్ష్మి, కలుపు శాస్త్రవేత్త సుబ్రమణ్యం, వ్యవసాయ శాఖ శ్రీకాకుళం, విజయనగరం జెడిలు శ్రీధర్, వి.టి రామారావు, అనకాపల్లి ఎడి రామారావు ఎం.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

చంద్రబాబును ఇంటికే పరిమితం చేస్తాం

రాష్ట్ర పశుసంవర్థక శాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయం సాధించి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును ఇంటికే పరిమితం చేస్తామని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. స్థానిక ప్రగతి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది వైసిపి కుటుంబ సభ్యులు ఉన్నారని, వారంతా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు. జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన మెగా పీపుల్స్ సర్వేలో రాష్ట్రంలో కోటి కుటుంబాలను కలిసినట్లు తెలిపారు. పలాస నియోజకవర్గంలో ఈ 15 రోజుల్లో 80 శాతం కుటుంబాలను సందర్శించామన్నారు. సిఎం జగన్ పాలనకు మద్దతుగా 80 లక్షలకు పైగా మిస్డ్ కాల్స్ వచ్చాయన్నారు. నవరత్నాల హామీలను వంద శాతం నెరవేర్చిన జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరిస్తున్నారనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఒకవైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిని సమతూకంలో అందిస్తూ జగన్ పాలన సాగిస్తున్నారని చెప్పారు. సచివాలయాల వ్యవస్థను తీసుకొచ్చి గ్రామ స్వరాజ్యాన్ని అందించారని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక భరోసా కల్పించిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కౌన్సిలర్ ప్రతినిధి ఎస్.గోపి తదితరులు పాల్గొన్నారు.

శివారు భూములకూ సాగునీరు లక్ష్యం

- నదుల అనుసంధానం పనులు పూర్తయితే జిల్లా సస్యశ్యామలం
- జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - పొందూరు

జిల్లాలో శివారు భూములకూ సాగునీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మండలంలోని వావిలపల్లిపేట సమీపంలో సుమారు రూ.26 కోట్లతో మడ్డువలస ఫేజ్-2 పునర్నిర్మాణ పనులకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంతో కలిసి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు ఇబ్బంది పడితే తట్టుకోలేని ప్రభుత్వం ఇదన్నారు. ఒడిశాతో వివాదం పరిష్కారం కాకపోవడం వల్ల నేరడి బ్యారేజీ నిర్మాణం జాప్యమవుతోందన్నారు. నీరు వృథా కాకూడదన్న కారణంగానే గొట్టాబ్యారేజీ వద్ద ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వంశధార, నాగావళి అనుసంధానం పనులు పూర్తయితే జిల్లా సస్యశ్యామలమవుతుందన్నారు. మడ్డువలస మొదటి దశ విస్తరణలో 27,500 ఎకరాలకు సాగునీరు అందుతోందన్నారు. రెండో దశ విస్తరణ ద్వారా అదనంగా 12,500 ఎకరాలకు సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇందుకోసం రూ.26.65 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ పరిపాలనా పరమైన ఆమోదం తెలిపిందన్నారు. దీని నిర్మాణంతో వర్షాధారిత భూముల అదనపు సాగుకు అవకాశం కలుగుతుందని చెప్పారు.

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మాట్లాడుతూ ఆమదాలవలస నియోజకవర్గానికి నారాయణపురం ఆనకట్ట తర్వాత మడ్డువలస ప్రధాన సాగునీటి వనరు అని అన్నారు. మడ్డువలస రెండో దశ విస్తరణ పనుల ద్వారా ధర్మపురం డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 12.25 కిలోమీటర్ల మేర 6,400 ఎకరాలు, అరిణాం అక్కివలస డిస్ట్రిబ్యూటరీ పరిధిలో 10.70 కిలోమీటర్ల మేర 6,100 ఎకరాలు పూర్తిస్థాయిలో సాగులోకి రానుందని తెలిపారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఉత్తరాంధ్ర సుజల స్రవంతిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీలు దువ్వాడ శ్రీనివాస్, నర్తు రామారావు, ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెడ్‌పిటిసి ఎల్.కాంతారావు, ఎంపిపి కిల్లి ఉషారాణి, వైస్ ఎంపిపి వండాన శ్రీదేవి, కాకర్ల చెల్లమాంబ, వైసిపి మండల అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, ఇరిగేషన్, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

గ్రామ స్వరాజ్య కలలు సాకారం

జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం కలలు 75 ఏళ్ల స్వాతంత్ర్యం తర్వాత వైసిపి ప్రభుత్వం సాకారం చేసిందని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. నగరంలోని జెడ్‌పి సమావేశ మందిరంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థతో ప్రజల ముగింటకే పాలన వచ్చిందన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను సచివాలయ వ్యవస్థ నుంచే అందిస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగ ప్రతిపత్తి పొందిన స్థానిక ప్రభుత్వాల్లోని ఆర్థిక, భౌతిక, మానవ వనరులను సమర్థవంతంగా వినియోగించుకుని పౌరుల అవసరాలను తీర్చడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. 29 ప్రభుత్వ శాఖలను అనుసంధానిస్తూ పాలన సాగుతోందని చెప్పారు. అనంతరం జిల్లాలో ఉత్తమ గ్రామ పంచాయతీలుగా ఎంపికైన బాలసీమ, పడ్డ, ఎత్తురాళ్లపాడు, చెల్లయ్యవలస, వమరవల్లి, దంత, బూరగాం పంచాయతీల సర్పంచ్‌లను సత్కరించి అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ నవీన్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డ్వామా పీడీ జి.వి చిట్టిరాజు, ఇతర శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

సర్టిఫికేట్లను అందజేస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జెసి

'స్పందన'కు 356 వినతులు

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 356 వినతులు వచ్చాయి. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి వినతులను స్వీకరించారు. అదనపు పరిహారం అందించాలని వంశధార నిర్వాసితుల నుంచే 60 వినతులు వచ్చాయి. వీటితో పాటు వ్యక్తిగత, సామాజిక సమస్యలపై వినతులు అందజేశారు. వినతుల స్వీకరణ అనంతరం కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. స్పందనలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించాలన్నారు. తిరస్కరిస్తే అందుకు గల కారణాలను తెలపాలన్నారు. పెండింగ్ దరఖాస్తులపై సమీక్షించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఉప కలెక్టర్ జయదేవి, కొవ్వాడ ప్రత్యేక ఉప కలెక్టర్ మురళీకృష్ణ, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, మెప్మా పీడీ మురళీకష్ణ, పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన శ్రీకాకుళం మున్సిపాలిటీ కాపురస్తులు పుప్పాల లేటు ఈశ్వరప్రసాదరావు గారి భార్య పుప్పాల 1) కౌసల్య అతని కుమార్తెలు 2) చెరుకూరి వెంకట పద్మజ 3) డబ్బీరు రాధరాణి జన ముగ్గురు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మంది తెలియజేయునది ఏమనగా

నా క్లయింటు కుటుంబానికి శ్రీకాకుళం టి.యస్.నెం. 882లో రిజిస్టర్డ్ దస్తావేజు నెంబరు 339/1902 ప్రకారం మరియు O.S.138/85 E.P.2002/2001 ప్రకారం తూ॥ఎ॥ 75 మూరలు అనగా 112 1/2 అడుగులు మరియు ఉ॥ ద॥ 128 మూరలు అనగా 192 అడుగులు స్థలంకు హద్దులు తూ॥ దక్షణాలకు హైదర్ ఖాన్ సాహెబ్, ఉ॥ రస్తా, పశ్చిమానికి గోర్జ హద్దుల మధ్య స్థలంలో దఖలు పడగా సదరు మొత్తం ఆస్థి పుప్పాల (లేటు) సూర్యారావు గారి శాఖకు సగభాగం మరియు పుప్పాల (లేటు) కామేశ్వరరావు గారి శాఖకు సగభాగం అనగా ఒక్కొక్క శాఖకు తూ॥ప॥ 56.3 అడుగులు దఖలు పడగా పుప్పాల (లేటు) సూర్యారావు గార్ల వారి తాలుక అవిభక్త వాటాను రెండు రిజిష్టర్డ్ క్రయ అగ్రిమెంట్లు దస్తావేజు నెం. 2771/1999 మరియు 2774/1999 ద్వారా కిల్లంశెట్టి పార్వతీశం మరియు పాండురంగారావు గారికి రిజిస్ట్రేషన్ చేయకుండా కొలతలు పెంచి లేని ఆస్థి ఉన్నట్లుగా తూ॥ప॥ 112.6 అడుగులు బదులుగా 160 అడుగులు (ఏ విధంగా పెరిగిందో తెలియపర్చాలి) ఉ॥19 అడుగులు బదులుగా 215 అడుగులుగా ఏ ఆధారంగా కొలతలు పెంచారో వివరించవలెను, వారిది కాని ఆస్థి వారిది అన్నట్లుగా కొలతలు పెంచి రిజిష్టర్డ్ పంపకం దస్తావేజు నెం. 3437/2003 వ్రాసి సదరు స్థలంలో తూ॥ ప॥ లకు 99 అడుగులు స్థలాన్ని దస్తావేజు నెం.3438/2003 మరియు 410/2006 క్రయ దస్తావేజులు బరాటం గోవిందరాజులు గార్కి అమ్మినట్లుగా రిజిస్ట్రేషన్ చేయించగా సదరు కిల్లంశెట్టి వారు 0.54/2004 మరియు O.S.132/2006 శ్రీకాకుళం మహారాజశ్రీ ఎడిషనల్ జిల్లా కోర్టులో సదరు పార్టిషన్ డీడ్ మరియు తప్పుడు క్రయ దస్తావేజును రద్దుచేసి వారి అగ్రిమెంటు ప్రకారం పార్టిషన్చేసి రిజిస్ట్రేషన్ చేయమని కోరగా శ్రీ కోర్టు వారు సదరు పార్టిషన్ మరియు క్రయ దస్తావేజును రద్దుచేసి కిల్లంశెట్టి వారికి అనుకూలంగా డిక్రీ ఇచ్చియున్నారు. సదరు దావాలో పుప్పాల హరిక్రిష్ణ 18వ ప్రతివాది. మా క్లయింట్లు అయినటువంటి కౌసల్య గారు 23వ ప్రతివాది, రాధారాణి 26, చెరుకూరు వెంకట పద్మజ 27వ ప్రతివాదిగా ఉన్నారు. అయినప్పటికి పుప్పాల హరిక్రిష్ణ మా క్లయింటు కుటుంబానికి మరి అమ్మడానికి స్థలం లేనప్పటికి మాదికాని ఆస్థిని అమ్ముతాము అని నమ్మించి ధర్మాన శశిధర్ గారి వద్ద నుండి రూ॥ 10 లక్షలు తీసుకొని ఈశ్వర ప్రసాదరావు గారితో రశీదు వ్రాయించి ఇప్పించినారు తదుపరి సదరు విషయం శశిధర్ గారు తెలుసుకొని ఛీటింగ్ కేసు పెట్టగా ఈశ్వర ప్రసాదరావు గారికి 1 సంవత్సరం జైలు శిక్ష మరియు 10 వేల రూపాయలు జరిమాన ఎక్సైజ్ మొబైల్ కోర్టువారు విధించి యున్నారు. సదరు శశిధర్ గారు మా కుటుంబానికి అమ్మడానికి స్థలం లేదు అని తెలుసుకొని అతను ఇచ్చిన డబ్బులు 10 లక్షలు రూపాయలు మరియు వడ్డీతో ఇప్పించమని O.S.49/2010 శ్రీకాకుళం అడిషనల్ జిల్లా కోర్టులో కేసువేయగా కోర్టువారు అతనికి అనుకూలంగా డిక్రీ ఇచ్చియున్నారు. సదరు డిక్రీ డబ్బులు కట్టనందున పుప్పాలవీధిలో ఉన్న మా క్లయింటు తాలూకా ఇంటిని EP 215/2019 in O.S.44/2010 శ్రీ కోర్టువారు ఎటాచ్మెంట్ చేసియున్నారు. హరిక్రిష్ణ చేసిన పనులకు ఈశ్వర ప్రసాద్ గారు మనస్థాపానికిగురై మరణించినారు. తదుపరి మా క్లయింట్లకు మరియు హరిక్రిష్ణకు కుటుంబ తగాదాలు వచ్చి ఒకరిపై ఒకరు లీగల్ నోటీసులు, పేపర్ పబ్లికేషన్లు మరియు క్రిమినల్ కేసులు 2007/2018 వేసుకొని మాట్లాడుకునే పరిస్థితికూడా లేదు అయినప్పటికీ సదరు హరిక్రిష్ణగారు ధర్మాన ధర్మారావు పై O.S.49/2017 డిక్లరేషన్ ఆఫ్ టైటిల్ మరియు పెర్మెనెంట్ ఇంజక్షన్ దావా మా క్లయింట్ సంతకాలను ఫోర్జరీచేసి అతనితో కలసి నా క్లయింట్లు కూడా సదరు తప్పుడు కేసు వేసినట్లుగా, తప్పుడు కేసు అతను కేసువేసినాడు. సదరు విషయం తెలిసినవెంటనే శ్రీ కోర్టువారికి సదరు విషయం తెలియపర్చగా సదరు హరిక్రిష్ణ మా క్లయింట్లను వాదుల నుండి ప్రతివాదులుగా ట్రాన్సుఫోజు చేసినారు. సదరుకేసు షెడ్యూలు భూమికి నా క్లయింట్ తాలూకా దస్తావేజు 339/1902 ద్వార దఖలు పడిన భూమికి ఎటువంటి సంబంధము లేదు. సదరు 1902 డాక్యుమెంటు ప్రకారం తూ॥ దక్షణాలకు హైదర్ఖాన్సాహెబ్ గారే హద్దుగా ఉన్నారు. వారి దగ్గర నుండి ధర్మాన ధర్మారావు గారు కొనుక్కొని ఆటోమొబైల్ గౌడౌన్గా నడుపుతున్నారు. అయినప్పటికి పై విషయాలను మభ్యపెట్టి తూర్పు పడమరలుగా 112/2 అడుగుల బదులుగా 160 చూపించి దొంగ సర్టిఫికెట్ సృష్టించి తప్పుడు కేసు వేసి వారి తాలూకా భూమిని సివిల్ డిస్ప్యూట్లో ఉన్నట్లు చిత్రీకరించి వారి వద్దనుండి డబ్బులు రాబట్టే ప్రయత్నం చేస్తూఉన్నారు. TS.No. 882 లో ధర్మాన ధర్మారావు గారికి ఉన్న 0.31 సెంట్లుకి, మా క్లయింట్లకు మరియు హరిక్రిష్ణకు ఎటువంటి సంబంధము లేదు, మా క్లయింటు స్థలానికి తూర్పుకి హద్దుగా ఉన్న హైదరఖాన్ దగ్గర నుండి ధర్మాన ధర్మారావు గారు కొనుక్కొన్నారు. మా క్లయింటు కుటుంబం తాలూకా స్థలం వేరు, ధర్మారావుగారి స్థలం వేరు, మా క్లయింటు కుటుంబానికి చెందిన స్థలం అర్ధత్రిభుజం వలె ఉండును అందువలన సదరు స్థలాన్ని 1902 సం॥ తాలూకా డాక్యుమెంట్లో ఉన్న కొలతలు ప్రకారం సర్వే చేయించినట్లయితే సదరు హరిక్రిష్ణ చేస్తున్న మోసం బయటపడుతుంది. అయినప్పటికి సదరు స్థలాన్ని మా క్లయింటు కుటుంబానికి చెందినదిగా చెప్పి మోసం చేస్తూఉన్నాడు. మరియు పుప్పాల గంగాధర్ గారి తదనంతరం అతని భార్య రాజేశ్వరి మరియు అతని కుమార్తె హర్షిణి ఉన్నప్పటికీ, గంగాధర్ పేరుమీద ఉన్న భూములు కూడా హరిక్రిష్ణ అమ్మి సొమ్ముచేసుకొనే ప్రయత్నంలో ఉన్నాడు. అందువలన హరిక్రిష్ణ గారితో ఎటువంటి లావాదేవీలు జరిపినను మోసపోవుదురని మరియు నా క్లయింట్లకు ఎటువంటి సబంధంలేదని, ఇందుమూలంగా ప్రజలందరికి తెలియజేయడమైనది.

శ్రీకాకుళం,
తేది: 25-04-2023.

ఇట్లు
పి.శాంతిస్వరూప్, అడ్వకేట్, శ్రీకాకుళం.

రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సచివాలయ సిబ్బంది పనితీరుపై
కలెక్టర్ ఆగ్రహం

ప్రజాశక్తి- పొందూరు

విధి నిర్వహణలో అలసత్వం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపై సచివాలయం సిబ్బందిపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పొందూరు ఎంపిడిఒ కార్యాలయం, సచివాలయం-1ని సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గర్భిణుల ఆరోగ్య పరిస్థితుల వివరాలు సక్రమంగా దస్త్రాల్లో నమోదు చేయకపోవడంపై ఎఎన్ఎంను సస్పెండ్ చేసి, వైద్యాధికారికి సోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు. అలాగే పలువురు సచివాలయం సేవలపై పలువురు ఉద్యోగులను ప్రశ్నించారు. అలాగే రూ.2 కోట్లు విలువైన ఎంపిడిఒ భవనం పూర్తియి సుమారు మూడేళ్లు అవుతున్నా దానిని ప్రారంభించకపోవడంపై అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కూలిపోయే స్థితిలో ఉన్న భవనంలోనే విధులు నిర్వహించడంపై మండిపడ్డారు. వారంలోగా కొత్త భవనంలోకి మారాలని, లేకుంటే ఎంపిడిఒ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ సస్పెండ్ చేస్తానని హెచ్చరించారు. ఎంపిడిఒ కార్యాలయం ఆవరణంలో అక్రమ బడ్డీ తొలగించాలని పక్కనే ఉన్న తహశీల్దార్ రాంబాబుకు సూచించారు. ప్రహరీ గోడ లోపల అక్రమంగా బడ్డీ పెడితే ఏమి చేశారంటూ అధికారులను ప్రశ్నించారు. దీనిని ప్రొక్లెయినర్ సహాయంతో వెంటనే తొలగించాలని ఆదేశించారు.

'ఐతమ్'లో సివిల్ ఇంజినీర్లకు శిక్షణ

టెక్కలి రూరల్ : టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల రెండో ఏడాది సివిల్ ఇంజినీరింగ్ కోర్సుకు చెందిన 132 మంది విద్యార్థులకు ఈనెల 17 నుంచి 22 వరకు, 24 నుంచి 29 వరకు ఎపిఎస్ఎస్‌డిసి ఆధ్వర్యాన సిఎంఎస్ ఎక్సెన్స్ ల్యాబ్లో రెవిట్ ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్' అనే అంశంపై శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 'డ్రాయింగ్ ఆఫ్ బిల్డింగ్ ప్లాన్ ఇన్ రివెట్ ఆర్కిటెక్చర్, ప్రొజెక్షన్ ఆఫ్ ప్లాన్స్ అండ్ ఎలివేషన్స్, 3డి మోడలింగ్ ఆఫ్ రెసిడెన్షియల్ అండ్ డ్వెల్లింగ్ హౌర్డ్, కెమారా వ్యూ అండ్ వాక్ త్రూ విత్ రివెట్ వెర్షన్, అసైనింగ్ ఆఫ్ వేరియస్ కాంపొనెంట్స్ టు 3డి ప్లాన్స్, మెటీరియల్ ఎస్టిమేషన్ అండ్ బెండింగ్ వ్యూ ఆఫ్ ఆల్ టైప్స్ ఆఫ్ బిల్డింగ్స్' అనే అంశాలపై విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆయనతో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సివిల్ హెచ్ఒడి డాక్టర్ పి.దినకర్, ఎపిఎస్ఎస్‌డిసి స్పోక్ డాక్టర్ వి.అశోక్ కుమార్, విభాగం కో-ఆర్డినేటర్ బి.షణ్ముఖరావు ట్రైనర్ జి.నేతాజి వెంకట సుబ్రమణ్యం పాల్గొన్నారు.

7 నుంచి జిల్లాస్థాయి క్రికెట్ టోర్నీ

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్లలో మే నెల 7 నుంచి కాటమ్మతల్లి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు రాబిన్, నాగార్జున ఒక ప్రకటనలో తెలిపారు. మే 5 వరకు టోర్నమెంట్లో పాల్గొనేందుకు అవకాశం ఉందని, ప్రతి టీమూ రూ.1300లు ప్రవేశ రుసుం చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. ఈ అవకాశాన్ని క్రికెట్ క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 8308729363, 9908670910, 9985437670 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఉత్తమ పంచాయతీలకు పురస్కారం

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ పంచాయతీలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ పార్లమెంట్ చేసిన 73వ రాజ్యాంగ సవరణ అమల్లోకి వచ్చిన సందర్భంగా ఏటా ఏప్రిల్ 24న దేశవ్యాప్తంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని జెడ్‌పిటిసి బెండి గోవిందరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా 9 అంశాలపై ఉత్తమ ప్రతిభ కనబరిచిన 10 పంచాయతీ సర్పంచ్‌లకు ఉత్తమ మండల స్థాయి అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. పేదరిక నిర్మూలన - ఉపాధి అవకాశాలు కల్పన, ఆరోగ్య పంచాయతీ, చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీ, వాటర్ సుఫిసెంట్ పంచాయతీ, క్లీన్ అండ్ గ్రీన్ పంచాయతీ, సెల్ఫ్ సుఫిసైం ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్ పంచాయతీ, సోషల్లీ సెక్యూర్డ్ పంచాయతీ, పంచాయతీ విత్ గుడ్ గవర్నెన్స్, ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ అంశాల్లో ప్రతిభ కనపరిచిన పంచాయతీలకు మెరిట్ ఆధారంగా అక్కులపేట, చింతలపేట, జి.కె.వలస, కట్యాచార్యులపేట, గాజులకొల్లివలస, కొత్తవలస, నెల్లిపర్తి, నిమ్మతొర్లాడ, తురకపేట, కొరపాం పంచాయతీలకు అవార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి తమ్మినేని శ్రీరామ్మూర్తి, ఇన్‌చార్జి ఎంపిడిఒ వాసుదేవరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసి పాల్గొన్నారు. కనుగులవలస సర్పంచ్ నూక అప్పల సూరన్నాయుడు మాట్లాడటానికి సమయం ఇవ్వాలని కోరగా, అందుకు అంగీకరించలేదు. అవార్డుల ప్రదానోత్సవం అనంతరం ప్రజాశక్తితో మాట్లాడుతూ పంచాయతీ నిధులను కాజేసిన వైసిపి ప్రభుత్వం ఈ అవార్డులను ఎందుకు పంపిణీ చేస్తున్నారని ప్రశ్నించారు. పంచాయతీ ప్రథమ పౌరుడు అయిన సర్పంచ్‌ను ఉత్సవ విగ్రహంలా మార్చేసి అవార్డుల పంపిణీకి తెరతీసిందని ఎద్దేవా చేశారు.

జలుమూరు: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, అటువంటి పల్లెలను, పల్లెల్లో ఉన్న ప్రజలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని ఎంపిపి వాన గోపి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సోమవారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, సిఎం జగన్మోహన్‌రెడ్డి గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన వివిధ కేటగిరీల్లో ప్రథమ స్థానంలో నిలిపిన ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్‌లు, కార్యదర్శులు ఎంపిపిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు మొజ్జాడ శ్యామలరావు, మండల సలహాదారుడు పైడి విఠ్ఠలరావు, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు బుక్క లక్ష్మణరావు, ఇఒపిఆర్‌డి పిఉమామహేశ్వరరావు, మండల పరిషత్ కార్యాలయ పరిపాలన అధికారి ఎ.దామోదరరావు పాల్గొన్నారు.

కవిటి: భారతదేశ ప్రగతిలో పంచాయతీలు పట్టుకొమ్మలని ఎంపిపి కడియాల పద్మ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ మేరకు స్థానిక సచివాలయంలో సర్పంచ్ పూడి లక్ష్మణరావు, ఇఒ వీరభద్రస్వామిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, రెడ్డిక జెఎసి రాష్ట్ర కార్యదర్శి బర్ల నాగభూషణం, ఎఎంసి చైర్మన్ దువ్వు కృష్ణారెడ్డి, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రాహి, ఎఒ జయంత్ ప్రసాద్, ఎపిఒ కడియం భాస్కరరావు పాల్గొన్నారు.

జి.సిగడాం : మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించి జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో ఎంపిపి మీసాల సత్యవతి, జెడ్‌పిటిసి కాయల రమణలకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. అలాగే సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకూ సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి మీసాల సాధ్వీమణి, మహిళా కన్వీనర్ కంది రమాదేవి, జి.సిగడాం పిఎసిఎస్ అధ్యక్షులు ఎర్నేన ప్రకాష్ పాల్గొన్నారు.

నందిగాం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ హెచ్.వి.రమణమూర్తి ఆధ్వర్యాన నిర్వహించిన జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంలో 13 మంది సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆర్.లక్ష్మీకాంతం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్, ఇఒఆర్‌పిఆర్‌డి రాజారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కాపుగోదయ్యవలస, తోటాడ, మరువాడ, కోటపాడు, నౌపడ, చెట్లతాండ్ర, వడ్డి తాండ్ర, ఇజ్జువరం, బోరుభద్ర, మర్రిపాడు, చిన్నతుంగాం పంచాయతీల సర్పంచ్‌లకు, కార్యదర్శులకు ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, ఎంపిడిఒ జి.ఉమాసుందరి దుశ్శాలువ కప్పి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శశిభూషణరావు, వైస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, కార్యదర్శుల సంఘం అధ్యక్షులు దుంప శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బూర్జ : మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవం కార్యక్రమంలో వైస్ ఎంపిపి బుడుమూరు సూర్యారావు, అవుట్ సోర్సింగ్ రాష్ట్ర డైరెక్టర్ ఖండాపు గోవిందరావు, జెడ్‌పిటిసి బి.రామారావు, డిసిఎంఎస్ మెంబర్ జల్లు బలరాంనాయుడు, మామిడివలస సర్పంచ్ గుమ్మడి రాంబాబు, ఎంపిడిఒ రవీంద్రబాబు, తహశీల్దార్ రమణారావు, బూర్జ సర్పంచ్ వేగు అనురాధ, ప్రతినిధి ఉదయకుమార్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : ఎంపిడిఒలో కార్యాలయంలో నిర్వహించిన పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవం సందర్భంగా 15 మంది సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు ఎంపిడిఒ చంద్రకుమారి అధ్యక్షతన ఎంపిపి ప్రతినిధి బి.ఉదయకుమార్ ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి ఆదినారాయుడు, ఎపిఒ తెంబూరు రవి, ఎఒ తిరుపతి పట్నాయక్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని పద్ద పంచాయతీ ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు సర్పంచ్ మజ్జి రామచంద్ర (రాము)కు జెడ్‌పిలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌లు ప్రశంసాపత్రాలను అందజేశారు.

కొత్తూరు : ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవ సందర్భంగా సర్పంచ్‌లకు, ఎంపిటిసిలకు నియోజకవర్గ వైసిపి నాయకులు లోతుగెడ్డ తులసీవర ప్రసాదరావు, ఎంపిపి సవర సావిత్రి దుశ్శాలువలు కప్పి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎం.పావని, ఇఒపిఆర్‌డి కె.కృష్ణారావు, ప్రత్యేకాహ్వానితులు ఎ.ప్రశాంత్‌కుమార్, సర్పంచ్‌లు వై.చామంతి, శంకరరావు, పోలినాయుడు, సంజీవరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: ఎంపిడిఒ కార్యాలయంలో మండలస్థాయి ఉత్తమ పంచాయతీలుగా ఎంపికైన సర్పంచ్‌లకు ఎంపిపి రోణంకి ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ అభివృద్ధికి కె.నిర్మలలు యితీలకు పురస్కారాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలపరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరావు, జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ అభివృది అధికారి కె. నిర్మలలు పురస్కారాలు అందజేశారు.

వజ్రపుకొత్తూరు : పంచాయతీల సమగ్ర అభివృద్ధికి సర్పంచ్‌లు, కార్యదర్శులు కృషి చేయాలని ఎంపిపి ఉప్పరపల్లి నీలవేణి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఈశ్వరమ్మ అధ్యక్షతన ఉత్తమ పాలన అందించిన 14 మంది సర్పంచ్‌లకు, కార్యదర్శులకు దుశ్శాలువ కప్పి సన్మానించి పురస్కారాలను అందజేశారు. మూడు విభాగాల్లో గరుడుభద్ర సర్పంచ్ గూడ గిరిజ ఈశ్వరరావు, గోపినాథపురం సర్పంచ్ కర్ని శ్రీను, పల్లివూరు సర్పంచ్ మామిడి భాస్కరరావు, అనంతగిరి సర్పంచ మల్లేశ్వరస్వామిను సన్మానించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధు కేశవరావు, ఇఒపిఆర్‌డి తిరుమలరావు పాల్గొన్నారు.

సోంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి డాక్టర్ ఎం దాసు, ఎంపిడిఒ వెంకటరమణలు ఉత్తమ సర్పంచ్‌లకు సన్మానించి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఆర్.విశ్వనాథం, సర్పంచ్‌లు తామర పద్మావతి, నగిరి ప్రభావతి, జి.రాజేశ్వరి, ఎస్.హరీష్, ఎస్‌రాజు, బి.శ్రీను పాల్గొన్నారు.

కాశీబుగ్గ : ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపికైన బాడాన పుష్ప (బ్రహ్మణతర్లా), దువ్వాడ వామాక్షి (అల్లుకోల), తామాడ మదన్(బొడ్డపాడు)లకు దుశ్శాలువ కప్పి సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ రమేష్‌నాయుడు, ఇఒపిఆర్‌డి మెట్ట వైకుంఠరావు, ఉంగసాయి కృష్ణ, దువ్వాడ రవి పాల్గొన్నారు.

మందస : పల్లె ప్రగతితోనే దేశ ప్రగతి సాధ్యమని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవం ఉత్తమ సర్పంచ్‌లుగా ఎంపికైన 26 మందికి దుశ్శాలువలతో సన్మానించి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి సీర ప్రసాద్, సచివాలయాల కన్వీనర్ చింతాడ గణపతి, ఇఒపిఆర్‌డి ఐ.వి.రమణ, ఎపిఒ హరికృష్ణ పాల్గొన్నారు.

మోహన్‌రెడ్డికి...

టెక్కలి : మండలంలోని బొప్పాయిపురం సర్పంచ్ గుజ్జు మోహన్‌రెడ్డికి అవార్డు లభించింది. ఈ మేరకు ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీరాజ్ జాతీయ దినోత్సవం సందర్భంగా ఎంపిపి ఆట్ల సరోజనమ్మ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పంచాయతీ అభివృద్ధిలో మోహన్‌రెడ్డి చేసిన కృషి ఆదర్శప్రాయమన్నారు.

నందిగాం : అవార్డు అందుకుంటున్న సర్పంచ్ రమణమ్మ

నరసన్నపేట : అవార్డు అందజేస్తున్న విజయ, కలెక్టర్

సంతబొమ్మాళి : ప్రసంసాపత్రాలను అందుకుంటున్న సర్పంచ్‌లు

టెక్కలి : అవార్డు అందుకుంటున్న మోహన్‌రెడ్డి

జెడ్‌పి చైర్‌పర్సన్, కలెక్టర్ చేతుల మీదుగా...

నరసన్నపేట: మండలంలోని ఉత్తమ పంచాయతీగా బాలసీమ ఎంపికైంది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కొన్ని ఉత్తమ పంచాయతీలను ఎంపిక చేసింది. అందులో అందులో బాలసీమ ఎంపిక కావడంతో జిల్లా పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ ఆరంగి జోష్నాకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ పురస్కారాన్ని అందజేశారు. పంచాయతీ ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన, పారిశుధ్య కార్యక్రమంలో ప్రత్యేక శ్రద్ధ వహించడంత తమకి ఈ గౌరవం లభించిందని సర్పంచ్ ఆనందం వ్యక్తం చేశారు. ఈమెకు ఎంపిపి ఆరంగి మరళి, జెడ్‌పిటిసి, సర్పంచ్‌లు అభినందనలు తెలిపారు.

ఉత్తమ పంచాయతీగా నందిగాం

నందిగాం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఉత్తమ పంచాయతీగా నందిగాం ఎంపికైంది. మంగళగిరిలో పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో సర్పంచ్ జె.రమణమ్మకు సోమవారం ఉత్తమ పంచాయతీ అవార్డును అందజేశారు. కార్యక్రమంలో జె.జయరాం పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వరంగాన్ని నిర్వీర్యం చేస్తున్న బిజెపి

కంచిలి : ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశవ్యాప్తంగా అనేక పోరాటాల ఫలితంగా ప్రభుత్వరంగ సంస్థలను అప్పటి ప్రభుత్వాలు నెలకొల్పాయని, వాటిని నిర్వీర్యం చేస్తూ కారు చౌకగా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఈ ప్రయత్నాలు విరమించకపోతే ఉద్యమం తప్పదని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.శ్రీరామ్మూర్తి, సిపిఎం నగర కన్వీనర్ టి.తిరుపతిరావులు హెచ్చరించారు. నగరంలోని సున్నపువీధి, జబ్బావీధి, దిగువ రెల్లి వీధి, నానుబాల వీధుల్లో సోమవారం ప్రచార భేరిని నిర్వహించారు. మనకి బాత్ అంటూనే, ప్రధాని మోడీ ప్రజాగొంతుల్ని నొక్కేస్తున్నాడని విమర్శించారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా కొత్త కొత్త చట్టాలతో ఉద్యమాలను అణగదొక్కేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. గ్యాస్ ధరలు పెంచుతూ, మరో వైపు గ్యాస్ సబ్సిడీ ఎత్తేశారని అన్నారు. వెంకటరావు పాణిగ్రహి, ఎస్.శ్రీనివాసులు, శ్రీదేవి పాణిగ్రహి, పి.ప్రభావతి, పి.ప్రసాద్ పాల్గొన్నారు.

కంచిలి : కంచిలి మండల కేంద్రంలో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన ప్రచార బేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార బేరి పోస్టర్‌ను స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు కప్ప గోపీనాథ్ ఆధ్వర్యాన ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ చేపట్టి కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు పిట్ట కృష్ణ, రఘు, రాజు, లోకనాథం, సిపిఐ నాయకులు సాలిన నారాయణస్వామి, జె.తరణి, సింహాచలం పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

ఎస్‌పి జి.ఆర్ రాధిక

మాట్లాడుతున్న ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి- శ్రీకాకుళం

నిరుద్యోగులు ఉద్యోగం పేరిట దళారులను నమ్మి మోసపోవద్దని ఎస్‌పి జి.ఆర్.రాధిక విజ్ఞప్తి చేశారు. ఎస్‌పి కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఉద్యోగ భర్తీ నోటిఫికేషన్ ద్వారా నిరుద్యోగులు కష్టపడి ఉద్యోగాలు సంపాదించాలని అన్నారు. అమాయకుల నుంచి డబ్బులు తీసుకుని ఆర్మీ, ఇతరత అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తానని హామీలు ఇస్తున్న మోసగాళ్లను నమ్మవద్దని సూచించారు. ఇటీవల కాలంలో ఈ విధమైన ఫిర్యాదులు అధిక సంఖ్యలో మా దృష్టికి వస్తున్నాయని అన్నారు. అందుకు ఉద్యోగులు ఇప్పిస్తామని దళారులు బేరసారాలు పెడితే సంబంధిత పోలీస్ స్టేషన్‌నకు సమాచారం అందించినట్లయితే చుట్టుపరంగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. అనంతరం ఫిర్యాదుదారులతో ముఖాముఖి నిర్వహించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదులనకూ ప్రాధాన్యత ఇచ్చి నిర్ణీత సమయంలోగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని పోలీసులకు ఆదేశించారు. ఈ మేరకు 61 అర్జీలను స్వీకరించారు. మోసపూరితమైన ఫిర్యాదులు 6, కుటుంబ తగదాలుకు సంబంధించినవి 8, ఆస్తి తగాదాలకు సంబంధించిన 8, పాత ఫిర్యాదులు 10, మిస్సింగ్‌పై 2, పౌర సంబంధాలపై 7, ఇతరులు 20 ఫిర్యాదు వచ్చాయని అన్నారు. కార్యక్రమంలో ఎఎస్‌పి టి.పి.విఠలేశ్వరరావు పాల్గొన్నారు.

ఎఎస్ఐ కుటుంబానికి అండ

కవిటి పోలీస్ స్టేషన్ ఎఎస్ఐగా డి.వి.భాస్కరరావు పనిచేస్తూ... ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన కుటుంబానికి అండగా ఉంటామని ఎస్‌పి జి.ఆర్.రాధిక భరోసా ఇచ్చారు. ఈ మేరకు మృతుడు భార్య భారతికి విడో ఫండ్, ఫ్లాగ్ ఫండ రూపంలో మొత్త రూ.75 వేలు చెక్కును ఎస్‌పి కార్యాలయంలో సోమవారం అందజేశారు. కార్యక్రమంలో సహాయ పరిపాలన అధికారిణి శోభారాణి, ఆయన కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అవయవ దాతకు అశ్రునివాళి

సోంపేట: తన ప్రాణం పోతున్నా ఐదుగురు ప్రాణాలు కాపాడేందుకు అవయవదానం చేసిన సోంపేటకు చెందిన విద్యార్థి మల్లారెడ్డి కిరణ్ చందుకి స్థానికులు అశ్రునయనాలతో నివాళ్లర్పించారు. సోమవారం ఉదయంకిరణ్ చందు స్వగ్రామానికి మృతదేహం చేరుకోగానే పెద్దఎత్తున స్థానికులు, యువత, విద్యార్థులు చేరుకున్నారు. అవయవదానం చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచిన చందు మృతదేహంతో పాటు నడుచుకుంటూ వెళ్లి జోహార్.. జోహార్ అంటూ, నీకు మర ణం లేదంటూ నినాదాలు చేస్తూ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సాయంత్రం మెయిన్ రోడ్‌లోని శ్రీనివాస మహల్ వద్ద నుంచి గాంధీ మండపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు.

కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

మూలపేట పోర్టుతో ఉద్యోగావకాశాలు

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సంతబొమ్మాళి మండలం మూలపేట పోర్టు నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతీయులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని కంబాలరాయుడుపేటలో సర్పంచ్ వంక చిరంజీవిరావు అధ్యక్షతన సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూలపేట పోర్టుకు నిధులు కేటాయించినది నేనే అని మాజీ చంద్రబాబు మైక్ ముందుకు వచ్చి చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. జన్మభూమి కమిటీల పెత్తనంతో ప్రజలపై స్వారీ చేసే దౌర్భాగ్యమైన చంద్రబాబు పాలన రాష్ట్రంలో ఎవరూ కోరుకోవడం లేదని అన్నారు. కంబాలరాయుడుపేట సముద్ర తీరాన్ని అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీనిచ్చారు. గత ప్రభుత్వాలకు, జగనన్న ప్రభుత్వానికి తేడాను గమనించాలని ప్రజలను కోరారు. విద్యార్థుల చదువులకు సహకారం అందించే ప్రభుత్వం అన్నారు. ఆర్థిక భారంతో పేదల చదువులను మధ్యలోనే నిలిపివేయకూడదని అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన వంటి బృహత్తర పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని అన్నారు. చేపలు వేట నిషేధం సమయంలో మత్స్యకార కుటుంబాలకు మత్స్యకార భరోసా ద్వారా రూ.10 వేలు ప్రభుత్వం అందిస్తుంది అన్నారు. జడ్‌పి వైస్ చైర్‌పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస్, వైసిపి మండల అధ్యక్షుడు పి.గురయ్య నాయుడు, పిఎసిఎస్ చైర్మన్ దువ్వాడ మధుకేశవరావు, ఎంపిటిసి కారి నీలవేణి పాల్గొన్నారు.

ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు

సంతబొమ్మాళి : మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే చెల్లుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మేఘవరంలో సర్పంచ్ పరపటి సునీత, ప్రతినిధి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ముద్రించిన పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి, పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, వైస్ ఎంపిపి ప్రతినిధి పొందల రామకృష్ణ, ఎంపిటిసి సూరాడ రాజారావు, మరువాడ వైసిపి ఇన్‌ఛార్జి గంట ఈశ్వరరావు, మత్స్యకార సొసైటీ జిల్లా డైరెక్టర్ సూరాడ జోగారావు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

యుబి కార్మికులను ఆదుకోవాలి

ధర్నా చేస్తున్న యుబి కార్మికులు

రణస్థలం: అర్ధాంతరంగా నిలుపుదల చేసిన యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులందరినీ విధుల్లోకి తీసుకుని పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని, లేనిపక్షంలో చట్టపరంగా వేతనాలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. కార్మికులకు పూర్తిస్థాయిలో పనిదినాలు కల్పించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన యునైటెడ్ బ్రేవరీస్ కార్మికులు బంటుపల్లి నుంచి ఐదు కిలోమీటర్లు మండుటెండలో పాదయాత్ర సోమవారం నిర్వహించారు. అనంతరం రణస్థలం తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 27న కార్మిక కుటుంబ సభ్యులతో ఛలో యునైటెడ్ బ్రేవరీస్ పరిశ్రమ కార్యక్రమం చేపడతామని తెలియజేశారు. యునైటెడ్ బ్రేవరీస్ యాజమాన్యం భూమిలిచ్చిన స్థానికులలైన కార్మికులకు పూర్తిస్థాయి పనిదినాలు ఇవ్వకుండా అర్ధాంతరంగా నిలుపుదల చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి తన బినామి మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఇస్తూ... యుబి ఉత్పత్తులైన కింగ్ ఫిషర్‌కు ఆర్డర్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని విమర్శించారు. 20 ఏళ్లుగా పనిచేస్తున్న 600 మంది కార్మిక కుటుంబాలను రోడ్డున పడేసి కుటుంబాల జీవితాలతో చెలగాటమాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ ఎస్.కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ధర్నాలో యునైటెడ్ బ్రేవరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు నాయుకులు పి.సత్యనారాయణ, టి.వెంకటరమణ, భద్రయ్య, చిన్న, కె.రమణ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

మణికంఠకు సన్మానం

రణస్థలం రూరల్: మండలంలోని చిల్లపేటరాజాంకు చెందిన పదో తరగతి విద్యార్థి కొంతల మణికంఠ టిసిఎస్-2019-20 ఆధ్వర్యాన టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యాన దేశవ్యాప్తంగా వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో జాతీయ స్థాయిలో మణికంఠ మొదటి స్థానంలో ప్రతిభకనబరిచారు. ఈ సందర్భంగా ఢిల్లీలో రాష్ట్రపతి కార్యాలయంలో ఈ నెల 17న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఎచ్చెర్ల నియోజకవర్గం వ్యవసాయశాఖ సలహా కమిటీ చైర్మన్ పైడి శ్రీనివాసరావు చిల్లపేటరాజాంలోని మణికంఠ స్వగృహానికి వెళ్లి మిఠాయిలు తినిపించి, దుశ్శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలయజేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. తన వంతు ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుందర్రావు, కంబపు నరసింహాలు, పైడి రాంబాబు, పైడి శ్రీను, సంతోష్, బండారి కృష్ణ, కె.గోవింద, వాసు, కోణతల లక్ష్మణరెడ్డి, తాతారావు గోవింద, లక్ష్మణరావు పాల్గొన్నారు.

మణికంఠను సన్మానిస్తున్న శ్రీనివాసరావు

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ఇచ్ఛాపురం : జిల్లాలో నివసించే స్వదేశీ మత్స్యకారులు కండ్ర సామాజిక తరగతికి బిసి-డి నుంచి బిసి-ఎ కేటగిరీలోకి ప్రభుత్వం మార్పు చేసింది. ఈ మేరకు ఎమ్మెల్సీ నర్తు రామారావు ఆధ్వర్యాన కండ్ర సామాజిక తరగతికి చెందిన వారు ఈదుపురం పుంచి బాజా, భజంత్రీలతో ఊరేగింపుగా బస్టాండ్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. జెడ్‌పిటిసి నారాయణమ్మ, కంచిలి జెడ్‌పిటిసి ప్రతినిధి ఇప్పిలి కృష్ణారావు, పిఎసిఎస్ అధ్యక్షులు నర్తు నరేంద్ర యాదవ్, ఈదుపురం సర్పంచ్ నర్తు వరప్రసాద్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు దువ్వు వివేకానందరెడ్డి, ఎంపిటిసి ప్రతినిధి నర్తు ప్రేమ్‌కుమార్‌లకు సన్మానించారు. కార్యక్రమంలో కేదారిపురం సర్పంచ్ నీలాపు సారధి, తులసిగాం సర్పంచ్ ప్రతినిధి ఇసురు తులసిరాం, ఎంపిటిసి ప్రతినిధి వలసయ్య, కండ్ర సంఘం జిల్లా అధ్యక్షులు మొండొళో మోహానో బెహర, ఈదుపురం సొసైటీ అధ్యక్షుడు గయా రామచంద్ర బెహర పాల్గొన్నారు.

చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రామారావు

కూలిన కల్వర్టు

కూలిన కల్వర్టు : తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని గొట్టూరు వద్ద ఉన్న కల్వర్టు సోమవారం కూలిపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ రోడ్డుపై నుంచి టిప్పర్ వెళ్తుండగా... ఒక్కసారిగా కల్వర్టు కూలిపోయింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. కల్వర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో గత పదేళ్లగా గ్రామస్తులు, వాహనదారులు బిక్కుబిక్కుమంటూ ప్రయాణం చేసేవారు. అయితే దీనిని గుర్తించిన సంబంధిత శాఖ అధికారులు 2017లో కల్వర్టు పనులు ప్రారంభించారు. కానీ, పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు.

మహిళకు గాయాలు

వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బూర్జ : మండలంలో పెద్దపేట పంచాయతీ నీలాపురం కూడలి వద్ద సోమవారం బైక్ పైనుంచి జారిపడి పాలకొండ మండలం పొట్లికి చెందిన బెజ్జిపురపు అరుణకుమారి గాయపడింది. పొట్లి నుంచి తన సోదరు సాయికుమార్‌తో అరుణకుమారి బైక్‌పై శ్రీకాకుళం వెళ్తున్నారు. నీలాపురం వద్ద అరుణకుమారి అస్వస్థతకు గురికావడంతో బైక్‌పై నుంచి జారి పడడంతో కాలుకు గాయమైంది. వెంటనే మదనాపురంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం వద్దకు తీసుకెళ్లారు. బూర్జ పిహెచ్‌సి వైద్యాధికారు పావని, రాజశేఖర్‌లు వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం 108లో జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

కొత్తూరు: మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ ఆర్.వేణుగోపాలరావు హెచ్చరించారు. స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. వేసవికాలం కావడంతో దొంగతనాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమంగా నాటు సారాను తరలించినా, విక్రయించినా కఠినంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు సారాతో మూడో సారి పట్టుబడిన వ్యక్తిపై పీడీ యాక్టు కేసు నమోదు చేస్తామన్నారు. వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వెళ్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. పేకాట శిబిరాలపై దృష్టిసారించామన్నారు. యువకులు ఆన్‌లైన్ పేకాట, తదితర ఆటలు ఆడితే పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. అలాగే సైబర్ నేరాగాళ్లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. తగాదాలు పడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఈయనతో పాటు ఎస్ఐ ఎం.గోవింద్ ఉన్నారు.



మాట్లాడుతున్న సిఐ వేణుగోపాలరావు

ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

అభివృద్ధి నిరోధకుడు జగన్

టిడిపి జిల్లా అధ్యక్షులు రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రాభివృద్ధికి నిరోధకుడు సిఎం వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులోని గొల్లవీధి, బనియన్ల ఫ్యాక్టరీ వీధి, 11వ వార్డు పరిధిలో అక్కివలస, పంతులుపేటల్లో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను, దోపిడీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు రాక నిరుద్యోగులు, కూలీలు ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారని అన్నారు. కానీ సిఎం అభివృద్ధిలో ఎపి టాప్ అని అభూత కల్పనలు సృష్టించి సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలూ అందరికీ వర్తింపచేయడం లేదని, లేనిపోని కొర్రీలు వేస్తూ కొందరికే అందజేస్తున్నారని అన్నారు. శిలాఫలకాలకే తప్ప అభివృద్ధి పనుల్లో సున్నా అని విమర్శించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ తమ్మినేని గీత, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, తమ్మినేని విద్యాసాగర్, సంపదరావు మురళి, బోర గోవిందరావు, ఇంజరాపు విశ్వనాథం, తంగి గురయ్య, నాగళ్ల మురళీధర్, చౌతాల గోవిందరావు, గొండు రమణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కూర్మారావు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యా సంక్షేమాధికారి, ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని ఒకటో వార్డు తిమ్మాపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు పొన్నాడ సౌజన్య అధ్యక్షతన విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ సభ్యుల సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలే మన ఆస్తి అని, ప్రతి తల్లిదండ్రులూ వేసవి సెలవులను వృథా చేయకుండా పిల్లల చదువుపై, ఆరోగ్యం దృష్టిసారించాలన్నారు. సెలవుల్లో జగనన్న గోరు ముద్ద పథకం ఉండదని, అందుకు ఇంటి వద్ద పౌష్టికాహారాన్ని తయారు చేసి అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు అమ్మఒడి, విద్యా కానుక, దీవెన ద్వారా పిల్లలకు అందిస్తున్న కిట్లపై అవగాహన కల్పించారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా పాఠశాల వాతావరణం, పిల్లలకు మెరుగైన సౌకర్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ పెంకి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగభూషణం

సోంపేట: సోంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా న్యాయవాది సీర నాగభూషణం ఎన్నికయ్యారు. స్థానిక కోర్టుల సముదాయం వద్ద సోమవారం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. అనంతరం కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నాగభూషణంకు న్యాయవాదులు, నాయకులు అభినందనలు తెలియజేశారు.

సామాజిక బాధ్యత అవసరం

ప్రజాశక్తి- టెక్కలి

కళాశాలల్లో చదివే విద్యార్థులు తమ చదువులతో పాటు సామాజిక దృక్పథాన్ని అలవర్చుకోవాలని, ప్రతి అంశాన్నీ సామాజిక బాధ్యతగా తీసుకోవాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బేపల సతీష్‌కుమార్ అన్నారు. జాతీయ సేవా విభాగం ఆధ్వర్యాన మండలంలోని మోదుగువలసలో జాతీయ సేవా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో శ్రామిక శక్తి అవసరమని అన్నారు. బన్నువాడ సర్పంచ్ పోలాకి మోహనరావు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో యువకుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పి.ఫాల్గుణరాఉవ, విశ్రాంత ఎంఇఒ బసవల అప్పలస్వామి, మోదుగువలస దుర్యోధనరావు, జాతీయ సేవా విభాగం పిఒ కందిగొల్ల, బిసాయ్ పాల్గొన్నారు.

'ఉపాధి' నిర్వీర్యానికి కేంద్రం కుట్ర

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యానికి కుట్ర చేస్తుందని సిపిఐ యంయల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అఖిల భారత కిసాన్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి డి.హరనాథ్ అన్నారు. మండలంలోని బొడ్డపాడు గ్రామ అమరవీరుల స్మారక మందిరం వద్ద సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇబ్బందులు గురి చేస్తున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్న ప్రభుత్వాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. ఉద్దాన ప్రాంత జీడి రైతులు సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ఉపాధి హామీని మరింత బలోపేతం చేయాలన్నారు. ప్రతి కుటుంబానికీ ఒక ఇంటి స్థలం ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, దానికి పట్టా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి యోజన పథకం ద్వారా ఇంటి నిర్మాణానికి ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. ఆహార సరుకులు, మందులు వైద్యానికి అవుతున్న ధరలను అదుపు చేయాలన్నారు. విద్య, ఆరోగ్యం ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. ఈనెల 27 మండలంలో నిర్వహించనున్న ధర్నాలో ఉపాధి, వ్యవసాయ, రైతులు కూలీలు, రైతులు ప్రజాస్వామికవాదులు, ప్రజాసంఘాల నాయకులు, మహిళా సంఘాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మద్దిల రామారావు, దున్న శ్రీనివాసులు, పోతనపల్లి కామేశ్వరరావు, అప్పారావు దుష్యంత్‌లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న హరనాథ్

పలువురికి ఆర్థికసాయం

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల కాలంలో ఎంతోమంది అభాగ్యులకు అండగా నిలిచిన చింతామణి ట్రస్టు సేవలు అభినందనీయమని కవిటి సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛందంగా అటెండర్ సేవలందిస్తున్న వికలాంగుడు, కవిటి కొత్తూరుకు చెందిన కొరికాన దివాకర్‌కు చింతామణి ట్రస్టు అండగా నిలిచింది. పుట్టుకతో వికలాంగుడైన దివాకర్ సేవలు గుర్తించిన చింతామణి ట్రస్టు (హైదరాబాద్) సభ్యులు సోమవారం దివాకర్ కు రూ.10వేలు సహాయం చేశారు. కార్యక్రమంలో పూడి లక్ష్మణరావు, పూడి నీలచలం, పాండవ శేఖర్, బెందాలం వెంకటేశ్వరరావు, దేవాడ దుర్యోధన, బర్ల నాగభూషణం, బాలక శ్రీను, నెయ్యిల విశ్వనాథం పాల్గొన్నారు.

కేన్సర్ రోగికి...

సంత బొమ్మాళి : మండలంలోని వడ్డివాడలో కేన్సర్‌తో బాధపడుతున్న కె.టి.నాయుడుకు సంతబొమ్మాళి యువజన సేవా సంఘం సభ్యులు రూ.8 వేలు ఆర్థిక సాయం అందజేశారు. సంఘం సభ్యులు అట్టాడ సాయి కుమార్, మాదిన వెంకటరావు, శంకరరావు పాల్గొన్నారు.

బాధితుడికి...

ఇచ్ఛాపురం : మున్సిపాల్టీ పరిధిలోని రత్తకన్నకు చెందిన హేమసుందర్ ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డాడు. వైద్య ఖర్చులకు డబ్బులు లేకపోవడంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఎలక్ట్రికల్ యూనియన్ రాష్ట్ర నాయకులు సోమవారం బాధితుడికి రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో లింగమల్లు శ్రీనివాసరావు, బత్తిన సురేష్‌బాబు, షేక్ కాశీం, రంగాల శ్రీనివాసరెడ్డి, కృష్ణారావు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలో ముక్తాపురానికి చెందిన మాధవి కుమారుడు కుమారస్వామి (10 నెలలు) బాలుడు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్నాడు. చికిత్స కోసం అధిక మొత్తంలో డబ్బులు అవసరం. దీంతో దాతల కోసం ఎదురు చూస్తున్నారు. విషయం తెలుసుకున్న ఉద్దానం సేవా సమితి సభ్యులు సోమవారం రూ.పది వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ వ్యాధి నుంచి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. శరత్‌కుమార్‌రెడ్డి, వసంత్, మాధవరావు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

నవధాన్యాలు సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని, ఖరీఫ్ అనంతరం 2023-24 సంబంధించి నవధాన్యాలు సాగు నేలతల్లి బాగుపై విస్తృత ప్రచారం చేయాలని నార్త్ కోస్ట్ రీజనల్ శిక్షణ అధికారులు ప్రకాష్, టి.హేమసుందర్ అన్నారు. పలాస వ్యవసాయశాఖ ఎడిఎ కార్యాలయం వద్ద సోమవారం వ్యవసాయశాఖ, ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నవధాన్యాల సాగు విధానంపై ఖరీఫ్ ప్రణాళికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరి చేత పిఎండిఎస్ గ్రామాలగా మార్చాలన్నారు. పిఎండిఎస్ వేసుకున్న ప్రతి రైతూ ఎస్2ఎస్ రైతుగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో డివిజనల్ యాంకర్ సిహెచ్.నాగరాజు, ధనుంజయరావు, పి.ఆర్.పి.పెంటయ్య, ఎంసిఆర్‌పిలు జి.మురళీధర్, పి.కృపాసింధు, తారక రామారావు, విశ్వనాథం పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలన నచ్చక, జగన్‌పై నమ్మకంలేక వైసిపి నాయకులు, కార్యకర్తలు టిడిపిలోకి చేరుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మండలంలోని నిమ్మాడ అచ్చెన్నాయుడు క్యాంపు కార్యాలయంలో టెక్కలి మండలం తొలుసూరుపల్లి పంచాయతీకి చెందిన వైసిపి నాయకులు శిగిలిపల్లి రామ్మూర్తి, హనుమంతు సింహాచలం, గూన మురళీరావు, హనుమంతు ఆనందరావుతో పాటు 20 కుటుంబాలు సోమవారం టిడిపిలోకి చేశారు. వారికి అచ్చెన్నాయుడు పార్టీ కండువ వేసి టిడిపిలోకి ఆహ్వానించారు. అలాగే కోటబొమ్మాళి మండలం కిష్టుపురం పంచాయతీ బలరాంపురం నుంచి కామెల్లి సోమేష్, వాసు, తదితరులు టిడిపిలోకి చేరారు.

చలివేంద్రం ఏర్పాటు

పలాస : వేసవి ఎండల దృష్ట్యా ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు కాశీబుగ్గ పోలీసులు ముందుకొచ్చారు. దీనిలో భాగంగా సోమవారం మూడు రోడ్ల కూడలి వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీనిని కాశీబుగ్గ డిఎస్‌పి శివరామరెడ్డి ప్రారంభించారు. కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న ఎండల వల్ల వడదెబ్బ తగిలే సూచనలు ఎక్కువగా ఉన్నాయని, ప్రయాణికులు తమ పనులను 11 గంటల లోపల ముగించి ఇళ్లకు చేరాలని సూచించారు.

మజ్జిగ అందజేస్తున్న డిఎస్‌పి శివరామరెడ్డి

జ్ఞాపికను స్వీకరిస్తున్న శ్రీకాంత్

అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ ప్రభుత్వ సలహాదారు జ్వాలపురం శ్రీకాంత్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో వివిధ విభాగాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం స్వామివారి సేవల్లో కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామివారి శేషవస్త్రాలను కప్పి ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ జ్ఞాపికను అందజేశారు.

పరామర్శిస్తున్న లక్ష్మీదేవి

లక్ష్మీదేవి పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని వన్‌టౌన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.కమలాకర్ తల్లి రాజేశ్వరి ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సోమవారం ఆయన స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, పార్టీ నాయకులు సురకాశి వెంకటరావు, భాస్కరరావు, కవ్వాడి సుశీల తదితరులు ఉన్నారు.

జగన్ పాలనపై జన విశ్వాసం

శాసనసభ స్పీకర్ సీతారాం

సీతారాం

ప్రజాశక్తి- ఆమదాలవలస

జగనన్నే మన భవిష్యత్ కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల్లో ఏడు లక్షల మందితో ప్రభుత్వంపై ప్రజాభిప్రాయ సేకరణ విజయవంతంగా కొనసాగుతున్నందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. స్పీకర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. జగన్ పాలనపై జనం తమ అభిప్రాయాన్ని ముక్కు సూటిగా వెల్లడి చేస్తున్నారని అన్నారు. 90 శాతం ప్రజానీకం జగన్ పరిపాలనపై సదాభిప్రాయంతో ఉన్నట్లు స్పష్టమైందని అన్నారు. ఈ నాలుగేళ్లలో మధ్యవర్తులకు, అవినీతికి ఎటువంటి తావు లేకుండా నేరుగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇంటికి చేరుతున్నాయని తెలిపారు.

హరితను సత్కరిస్తున్న న్యాయవాదులు

సివిల్ జడ్జికి సన్మానం

ప్రజాశక్తి- టెక్కలి

టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి టి.హరిత అనంతపురం జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా బార్ ఆసోసియేషన్ అధ్యక్షులు దివ్వల వివేకానంద మాట్లాడుతూ కరోనా సమయంలో బాధ్యతలు స్వీకరించిన హరిత న్యాయవాదులకు, కక్షిదారులకు ఇబ్బందులు కలుగకుండా విధి నిర్వహణలో ఆమె చూపిన ప్రతిభ ఆదర్శప్రాయమని అన్నారు. న్యాయ విజ్ఞాన సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యానికి కృషి చేశారని అన్నారు. సన్మానగ్రహీత మాట్లాడుతూ తన విధి నిర్వహణలో సహకరించిన వారందరికీ అభినందించారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు పేడాడ బాబూరావు, ఖజానా వెంకటరావు, దవళ రాజేశ్వరరావు, పి.సాయిరాజ్, వైకుంఠరావు పాణిగ్రాహి, అంపోలు వైకుంఠరావు, పొట్నూరు ఆనందరావు, పైల చంద్రుడు, కె.ఈశ్వరరావు, ఎ.రాజేష్, పి.మధుబాబు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రామిరెడ్డి

'ఉపాధి' పనులు ప్రారంభం

సంతబొమ్మాళి : మండలంలోని గోవిందపురం పంచాయతీ పంగజగ్గుపేటలో సర్పంచ్ రెయ్యి రామిరెడ్డి సోవారం ఉపాధి పనులను ప్రారంభించారు. జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్ రెడ్డి వీరన్నకు సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు పనపాన తులసమ్మ, టెక్నికల్ అసిస్టెంట్ గొండు లక్ష్మణరావు, కార్యదర్శి ఎస్.ఢిల్లేశ్వరరావు, వాలంటీర్ రాజేశ్వరి పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్ ఏర్పాటు చేయాలని వినతి

శ్రీకాకుళం అర్బన్ : పిఎఫ్ హయ్యర్ పెన్షన్స్ ఆన్ లైన్ చేసేందుకు హెల్ప్ లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాని ఆర్‌టిసి విశ్రాంత నాయకులు కొర్లాం గణేష్, ఎస్.ఎస్.ఆర్.శర్మ, ప్రసాదరావులు కోరారు. ఈ మేరకు సోమవారం శ్రీకాకుళం పిఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ అశుతోష్ మిశ్రాను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పిఎఫ్-95 పెన్షనర్స్ హయ్యర్ పెన్షన్ కోసం ఆన్‌లైన్ చేయించుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. విశ్రాంత ఆర్‌టిసి ఉద్యోగులు ఆన్‌లైన్ చేసుకునేందుకు అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. అందువల్ల హెల్ప్‌లైన్ కేంద్రాన్ని మంజూరు చేయాలని కోరారు.